


ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగిరం చేయండి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 27 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 07

# రోడ్ల పనులకు ఆలస్యం తగదు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో జరుగుతున్న రహదారులు,వంతెనల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను కఠినంగా ఆదేశించారు.గురువారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయం,ఇందిరాభవన్ లో ఆర్‌బీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో బుద్ధారం,అప్పాజిపేట, బ్రాహ్మణవెల్లంల రహదారి పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి రెండు నెలల్లోగా వాటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమనవాగుపై నిర్మాణంలో ఉన్న పగిడిమర్రి వంతెన పనులను మూడు నెలల్లోగా పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు.కనగల్ జంక్షన్ నుంచి కనగల్ గ్రామం వరకు నాలుగు లేన్ల రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.అలాగే కనగల్‌తిమ్మన్నగూడెం రహదారి పనులను వేగవంతం చేయాలని సూచించారు. మామిడాల,గోదోరిగూడెం,ఎల్లమ్మగూడెం గ్రామాల రహదారి పనులపై కూడా సమీక్ష జరిపి,మామిడాలలో సీసీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని పేర్కొన్నారు.నార్కెట్‌పల్లి మండ్ర రహదారి పనులను వెంటనే ప్రారంభించాలంటూ సంబంధిత కాంట్రాక్టర్‌కు కఠిన ఆదేశాలు జారీ చేశారు.వైటీపీఎస్ రహదారి పనుల పురోగతిని నల్లగొండ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు.నిర్ణయించిన గడువుల్లో పనులు పూర్తికాకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,ఆర్‌బీ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి

# రైతాంగానికి సాగునీరందించాలి



## సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌సి చర్లగూడెం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునిరు అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం చౌటుప్పల్‌లో ఓ శుభాకార్యానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హాజరైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన డిండి ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన చర్లగూడెం రిజర్వాయర్ పూర్తయితే వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయని, రాచకొండలో ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా నారాయణపురం, చౌటుప్పల్ మండలాల, రైతులకు అనేక గ్రామాలకు సాగునీరు అందించవచ్చని, భూగర్భ జలాలు పెరిగి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఫ్లోరిన్ పిడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గలకు సాగు, త్రాగు నీటిని కలగ మార్చవద్దని, ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వాలు ఏదో నామమాత్రపు నిధులు కేటాయిస్తున్నారని, అలా కాకుండా వచ్చే బడ్జెట్‌లో ప్రాజెక్టు పూర్తయ్యేందుకు సరిపడా నిధులని మంజూరు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా మంత్రులు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రాజెక్టుల సాధన కోసం గతంలో సీపీఐ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించడం జరిగిందని, మళ్ళీ ప్రజా పోరాటాలకు కూడా వెనకాడబోమని ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరందించే వరకు విడతల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, పగిల్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పొట్ట శంకరయ్య, రొండి నర్సింహా, టంగుటూరి రాములు, నర్సింహా తదితరులు ఉన్నారు.



# నేత్రపర్వం.. దివ్యవిమాన రథోత్సవం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కళ్యాణ లక్ష్మీ నరసింహులను దివ్య విమాన రథంలో భక్తులు సేవించారు. వివిధ రకాల పుష్పాలు, మామిడి, అరటి తోరణాలతో దివ్య విమాన రథాన్ని శోభాయమానంగా అలంకరించి, విశ్వక్సేనుడికి తొలి పూజతో రథోత్సవాన్ని అరంభించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో కల్యాణ దంపతులైన లక్ష్మీ నరసింహ స్వామిని అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దివ్య విమాన రథంపై ఊరేగించారు. వేద పారాయణాలు, మూలమంత్ర పఠనాలతో రథాంగ హోమం పూజలు చేసి స్వామికి హారతి నివేదించారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ ఏక శిఖరవాసుడిని విహారింపజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగింది. దివ్య విమాన రథోత్సవాలను దేవస్థాన ప్రధానార్చకులు కాండూరి వేంకటాచార్యులు, బట్టర్సురేంద్ర చార్యులు బృందం, పారాయణికులు ఆగమశాస్త్ర రీతిలో నిర్వహించారు.

నేడు చక్రతీర్థం : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, రాత్రి శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపోత్సవం నిర్వహించనున్నారు.

# డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐ ముగ్గురిని డిస్మిస్ చేయాలి

## పార్టీ పక్షాన రూ.5 లక్షల ఆర్థిక సాయం

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/కోదాడ:** కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరగకపోతే జాతీయస్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కోదాడ పట్టణంలోని ఇటీవల లాకప్‌డెత్‌లో మృతి చెందిన కర్ల రాజేష్ కుటుంబాన్ని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ లతో కలిసి తల్లి లలితమ్మను ఆయన పరామర్శించారు. రాజేష్ మృతికి కారకులైన పోలీస్ యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిని ఎందుకు కాపాడుతున్నారో జవాబు చెప్పాలన్నారు. దుర్మార్గానికి ఒడిగట్టిన డిఎస్‌పి, సిఐ , ఎస్‌ఐ లను విధుల నుండి సస్పెండ్ చేయాలన్నారు. డిఎస్‌పిపై చర్యలు తీసుకోకుండా స్థానిక మంత్రి సివిల్ సప్లై శాఖలో పదోన్నతి కల్పించడం కోసం వెనుకాల అంతర్యం ఏమిటని అన్నారు. తమ ప్రభుత్వ హాయంలో లాక్ ఆప్ డెత్‌లో మృతి చెందిన మరియమ్మ కేసులో పూర్తి న్యాయం చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాజేష్ కుటుంబానికి తీవ్ర అన్యాయానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పక్షాన బాధిత కుటుంబానికి ఐదు లక్షల సహాయాన్ని ప్రకటించారు. అనంతరం రాజేష్ తల్లితో కలిసి రాజేష్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

# ఎంపిని కలిసిన మోత్కూర్ మున్సిపల్ బృందం



ప్రజాపక్షం/మోత్కూర్ : భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని హైదరాబాదులోని తన నివాసంలో మోత్కూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని వారు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లందరినీ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ నూతనంగా గెలిచిన కౌన్సిలర్లు అందరికీ దిశానిర్దేశం చేశారు. మోత్కూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గెలిచిన నాయకులందరూ సమిష్టిగా, ఒకే తాటిపై నడుస్తూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజా సేవలో నిమగ్నం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతినిధులు, కౌన్సిలర్లు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండలంలోని డి రేపాక గ్రామంలో గురువారం కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడ్డగూడూరు మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనేది రసాయన మందులు, పురుగుమందులు వాడకుండా కేవలం సహజ సిద్ధమైన దేశి ఆవు పేడ మూత్రం ఆదారంగా సాగు చేసే పద్ధతి అని తెలిపారు. ఈ వ్యవసాయ పద్ధతిలో జీవామృతం, బీజామృతం వాడడం అచ్ఛాదనం మిశ్రమ పంటలు ఇతర సేంద్రియ పద్ధతిని పాటించడం ద్వారా పెట్టుబడి లేని వ్యవసాయం ఆరోగ్యమైన దిగుబడి సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.పాండురంగచారి, వ్యవసాయ విస్తరణ అధికారి జి.దయాకర్, సిఆర్పి సిహెచ్ స్వాతి, సిహెచ్ సౌజన్య, రేపాక రైతులు పాల్గొన్నారు.

## లక్ష పుష్పార్చన



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం కనుముకుల గ్రామంలో శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం లక్షపుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హోమం, బలిహరణం నిర్వహించారు. ఈనెల 22 నుండి ప్రారంభమైన వార్షికోత్సవాలలో భాగంగా నేడు చక్రస్నానం కనుల పండువగ జరగనుంది. ఆలయ ఫౌండర్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి కోట మల్లారెడ్డి పుష్పలత, ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి గౌరవాధ్యక్షులు గట్టు పాండురంగారెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి, కోట అజిత్ రెడ్డి, నూకల లింగస్వామి యాదవ్ పాల్గొన్నారు.

## టైలర్స్‌డేను జయప్రదం చేయాలి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: కుట్టుమిషన్ కనిపెట్టి లక్షలాది మందికి జీవన ఉపాధి కల్పించిన కుట్టుమిషన్ నిర్మాత విలియమ్స్ హోను స్మరించుకుంటూ ఈనెల 28న జరుపుకునే టైలర్స్‌డేను జయప్రదం చేయాలని జిల్లా టైలర్స్ యూనియన్ నాయకులు బాజివుల్లా విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని గాంధీ పార్కు వద్ద జరిగిన టైలర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ నాయకులు పర్వతపు సతీష్, కోలపూడి దేవిడ్, ఎమ్మెస్, సైదులు, రామారావు, మాస్టర్ శ్రీనివాస్, ఖాదర్‌సాబ్, వెంకటేశ్వర్లు, వెంకన్న, గొట్టె అంజి, ఎస్‌కె సైదా పాల్గొన్నారు.



# స్వేచ్ఛ, సమానతకు విద్యార్థులే మూలం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: అసమానతలు, హింస, దుఃఖం లేని, కులమతాల అంతరాలు లేని శాంతితో కూడిన సమతా సమాజాన్ని కలలుగన్న బుద్ధుడు, జ్యోతిరావుపూలే, కబీర్లు తన గురువులుగా ప్రకటించుకున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్ఫూర్తిలో రాసిన రాజ్యాంగపు లక్ష్యాల సాధన విద్యార్థుల చేతుల్లోనే ఉందని మరో గ్రంథాలయ ఉద్యమకారుడు కస్తూరి ప్రభాకర్ అన్నారు. డాక్టర్ ముప్పా రామారావు, డాక్టర్ రాజులు మాట్లాడుతూ బుద్ధునితో నా ప్రయాణం అన్న నాటకం అంబేద్కర్‌పై చూపిన ప్రభావాన్ని, ఇవాల్టి అసమ సమాజిక స్థితిలో కొనసాగుతున్న దుఃఖానికి, వేదనకు, పీడనకు, కులమత ఆధిపత్యాలకు పరిష్కారం చూపిన బుద్ధుని బోధనలు ఇవాల్టికి అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మార్చి 3న జరిగే నాటకాన్ని చూసి స్ఫూర్తిని పొందాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటరమణ, విద్యార్థి నాయకుడు అజయ్ పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ పోరాటం లలితమ్మకు ప్రభుత్వ ఉద్యోగం



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణానికి చెందిన మాదిగ యువకుడు కర్ల రాజేష్ లాకప్‌డెత్ గురైన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ గత 100 రోజులుగా అనేక దశల వారిగా నడిపిన ఉద్యమ ఫలితంగా, అలాగే రాజ్యాంగబద్ధంగా ఉన్న అనేక వ్యవస్థలను కదిలించిన ఫలితంగా కర్ల లలితమ్మకు ప్రభుత్వ ఉద్యోగం లభించింది. గురువారం కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, ఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ దయానందరాణి, తహసిల్దార్ వాజిద్, కర్ల లలితమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకుల సమక్షంలో ఉద్యోగ నియామకపత్రం అందజేశారు. కర్ల లలితమ్మ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగం నియామకపత్రం అందజేసిన ఆర్డీవో సూర్యానారాయణ, ఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ దయానందరాణి, తహసిల్దార్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద్, బచ్చలకూర వెంకటేశ్వర్లు, ఏపూరి రాజు, కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, పాతకోట్ల నాగరాజు, గుడిపాటి కనకయ్య మాదిగ, లంజపల్లి శ్రీను, పిడమర్తి చిన్న వెంకట్రావ్ పాల్గొన్నారు.

# నాయకత్వ లక్షణాలు పెంపుదలకు స్కూల్ హౌజ్ సిస్టం



ప్రజాపక్షం/కోదాడ: పాఠశాల నిర్వహణలో స్కూల్ హౌజ్ సిస్టం విద్యార్థుల భాగస్వామ్యమని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. గురువారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ హౌజ్ సిస్టం విద్యార్థులకు డ్రెస్ దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహణలో భాగంగా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపుదల, ప్రత్యక్షంగా పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాల పెంపుదలపై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. మొత్తం పాఠశాల విద్యార్థులను నాలుగు భాగాలుగా విభజించి సివి రామన్ టీం (బ్లూకలర్), ఠాగూర్ టీం (పసుపు కలర్), అబ్దుల్ కలాం టీం (ఎరుపు కలర్), శకుంతల దేవి టీం (గ్రీన్ కలర్) లు పాఠశాలకు హెడ్ ఒక బాలుడు, ఒక బాలిక, స్పోర్ట్స్ విభాగంలో ఒక బాలుగు, నలుగురు సెక్రటరీలు, ప్రతి క్లాస్ నుండి ఇద్దరు విద్యార్థులు సెక్రటరీలుగా ఉండి పాఠశాల నిర్వహణలో ముందుండి నడుపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు డి.మార్కేండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుభరోసా వేయరా?

ప్రజాపక్షం/గరిడేపల్లి: ఇప్పటికే రబీ సీజన్ చివరి దశకు చేరుకుందని, ఐనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేయరా అని సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకుబ్ అన్నారు. గురువారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ స్రవంతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎకరాకు 15వేలు ఇస్తామన్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఎకరాకు 12వేలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదులు, ధ్రుదులు వెంకన్న, బి.శ్రీనివాస్, సైదయ్య, అంబటి బిక్షమయ్య, యానాల సోమయ్య, కళమ్మ, అర్జున్ పాల్గొన్నారు.



## మహిళ శ్రీశక్తి భవనానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/మునగాల: మహిళ సంఘాల అభివృద్ధి కోసం మహిళ సమాఖ్య కార్యాలయాల ఏర్పాటు ఎంతో వారికి బాధ్యతనిస్తుందని సర్పంచ్ చల్లా గురవయ్య అన్నారు. గురువారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ప్రభుత్వం నుండి మంజూరైన శ్రీశక్తి మహిళ సమాఖ్య నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఇది ఎంతో తోడ్పాటు అందిస్తుందని అన్నారు. మహిళలు సమావేశం నిర్వహించాలంటే చెట్ల కింద కాకుండా వారికి స్వయంగా కార్యాలయం ఏర్పాటు చేస్తే వారికి మంచి సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ రమేష్‌బాబు, వార్డు సభ్యులు రమనబోయిన రమేష్ పాల్గొన్నారు.

## ఎర్నేని కుసుమకు సన్మానం



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబుకు గురువారం రజక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రజకులు మాట్లాడుతూ హుజూర్‌నగర్ రోడ్డు పక్కన అయ్యప్ప స్వామి దేవాలయం వెనుక దోభిఘాట్ నిధులతో ప్రభుత్వం చేత కట్టబడిన భవనమును ఐలమ్మ భవనంగా ప్రకటించి రజకులకు అధీనపర్చాలని చైర్‌పర్సన్‌ను కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తప్పకుండా ఆ భవనానికి ఐలమ్మ భవనంగా పేరు మార్చి రజకులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లతో మాట్లాడి రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నట్టు ఎల్లయ్య, దాచేపల్లి నర్సింహస్వామి, పొనుగోటి కోటయ్య, లింగయ్య, ఉల్లెందుల లింగయ్య, భూమా బిక్షం, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/రామన్నపేట : విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిజిఎం బాలస్వామినీ కలిసి రామన్నపేట ఉపసర్పంచ్ మోటె రమేష్ మాట్లాడుతూ పట్టణంలో బీసీ కాలనీలో కొత్త ఏర్పాటు చేస్తున్నా స్తంభాలకు ఎల్‌టి 11 కెవి, 33 కెవి లైన్లను ఒకటే పెద్ద స్తంభానికి ఉండే విధంగా, ఎస్సి కాలనీలో గౌర్ల మల్లయ్య ఇంటి మీద నుండి 11 కేవీ లైన్ని తొలగించాలని, అదే విధంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజీ వద్ద భువనగిరి రోడ్డు మీద ఉన్నటువంటి కరెంటు స్తంభాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి సుదర్శన్, బండ లింగస్వామి, మోటె మహేష్, జడ సంతోష్, సుర్వి హరిబాబు, ఊట్కూరి శ్రీను, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ద్వితీయ భాష (తెలుగు,సంస్కృతం,ఉర్దూ,హిందీ) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.గురువారం నిర్వహించిన ఈ పరీక్షకు సెట్ బి ప్రశ్నపత్రం ఉపయోగించబడింది.జిల్లా వ్యాప్తంగా 13,117 మంది విద్యార్థులు నమోదు కాగా, అందులో జనరల్ విభాగానికి చెందిన 11,480 మంది, వొకేషనల్ విభాగానికి చెందిన 1,637 మంది ఉన్నారు. పరీక్షకు జనరల్ లో215,వొకేషనల్ 71మొత్తం 286 మంది గైర్హాజరు కగా 12,831 మంది విద్యార్థులు హాజ నమోదైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్ తెలిపారు.



## చైర్మన్, వైస్ చైర్మన్లకు సన్మానం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణ దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు ఆకుల రాము ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, ఫ్లోర్ లీడర్ కోతి సంపత్‌రెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వికలాంగులందరికి రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని, వికలాంగుల సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాటి లక్ష్మణ్ రావు, నందిగామ పాపయ్య, పట్టణ అధ్యక్షులు మన్యం వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు అసోదు శ్రీను, వల్లెపు రామకృష్ణ, గంపల కొండలు, ఉత్పల వీరబాబు, గుగ్గిళ్ల సైదులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని అభ్యాస్ ప్రైమరీ స్కూల్ గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్ వంగాల పుష్పలతలు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించిత పలువురిని ఆకట్టుకున్నారని అన్నారు. ఇలాంటి స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ద్వితీయ సంవత్సర పరీక్షలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఏడు కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాల, టీడబ్ల్యుఆర్ ఎస్ గురుకులం, కేఎల్‌ఎన్, సినాప్స్, సాకేతి, శ్రీఅరోరా, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు ముందస్తుగానే చేరుకున్నారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు జూనియర్ కళాశాల కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.మాధవి తెలిపారు. ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులతో ఒకేషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు పరీక్షలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్స్ రాజు, సుదర్శన్‌రెడ్డి, ఆశాలత, కృష్ణవేణి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



## ఎంజియూలో విద్యార్థి సంఘాల ఆందోళనలపై పోలీసుల కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల విద్యార్థి సమస్యలపై వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,ఎంఎస్ఎఫ్,ఏబీవీపీ,బీసీ విద్యార్థి సంఘాలు,కు చెందిన నాయకులు యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద తాళం వేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్ యూనివర్సిటీకి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించినట్లు సమాచారం.సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అల్తాఫ్ హుస్సేన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు అనుమతి లేకుండా నిరసనలు చేపట్టవద్దని హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. యూనివర్సిటీ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘాలను పోలీసులు అణచివేయాలని చూస్తున్నారని విద్యార్థి నాయకులు ఆరోపిస్తున్నారు.

## అంధ విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో తొలిసారిగా దృష్టి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ కార్నర్ ఏర్పాటు చేయడం గర్వకారణమని నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంఏ ఆఫీజ్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన ఈ ప్రత్యేక కార్నర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్లైండ్ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్రెయిలి పుస్తకాలు,ఆడియో బుక్స్,ఈబుక్స్, స్క్రీన్ రీడర్ సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్లు, ప్రత్యేక పఠన విభాగం, సహాయక సాంకేతిక పరికరాలు వంటి ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ బడ్జెట్ ద్వారా గ్రంథాలయాల అభివృద్ధి,నూతన పుస్తకాల కొనుగోలు, భవనాల మరమ్మతులు,డిజిటల్ లైబ్రరీ విస్తరణ,భద్రతా చర్యలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో కార్యదర్శి బాలమ్మ,అనిల్ కుమార్,కృష్ణ, మోహన్,నరసింహారెడ్డి తదితర గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాలోని బిసిలకు అవకాశం కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో త్వరలో భర్తీ అయ్యే నామినేటెడ్ పోస్టుల్లో నల్లగొండ జిల్లా బీసీలకు అధిక శాతం అవకాశం కల్పించి కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియమించిన కార్పోరేషన్ ఛైర్మన్‌లలో ప్రాధాన్యత కలిగిన అధిక శాతం పదవులను ఒకేఒక సామాజిక వర్గానికి కేటాయించారని నియమిత పదవుల్లో కూడా బీసీలకు అవకాశం ఇవ్వకపోతే ఎలా అని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నాం. పేరుకే సామాజిక న్యాయం అని చెప్పుకోని తిరుగుతూ చేతల్లో చూపించకుంటే ఎట్లా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని నమ్ముకోని పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన బీసీలకు మొదటగా మీ చేతిలో ఉన్న కార్పోరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్ పదవులను బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఇచ్చి బీసీల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని దామాషా ప్రకారం ఇచ్చి బీసీల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నల్లగొండ జిల్లాలో పార్టీలు మారిన అగ్రకులాలకు పదవులు ఇస్తున్నారు కాని మొదటి నుంచి పార్టీని నమ్మకోని ఉన్న సీనియర్ బీసీలకు మాత్రం ఎలాంటి న్యాయం జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు నల్లగొండ జిల్లాలో ఉన్న బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు.

## మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28 వార్డులను అభివృద్ధితో సుందరంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 24వ వార్డులో ఏళ్ల నాటి విద్యుత్ సమస్యలకు మోక్షం లభించనుంది. కొత్త బైపాస్ రోడ్డు ఏర్పాటు కావడంతో పాటు వార్డు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, గతంలో ఏర్పాటు చేసిన పాత ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టి లైన్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గురువారం విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస్‌లు, ఏఈ రాంప్రసాద్, 24వ వార్డు కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణలతో కలిసి మున్సిపల్ చైర్మన్ వార్డులో పర్యటించారు. విద్యుత్ లైన్ల మార్పు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంపై చర్చించారు. చైర్మన్‌కు విన్నపానికి సానుకూలంగా స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు తక్షణమే సమస్య పరిష్కారానికి రూ. రెండు లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్ చంద్రమౌళి, బ్రహ్మారెడ్డి, ఎల్‌ఎమ్‌లు నాగరాజు, గురవయ్య, జగదీష్, బాబు నాయక్, జెఎల్‌ఎమ్ గోపిచంద్‌పాల్గొన్నారు.

## రజక వృత్తిదారుల నిరసన

**ప్రజాపక్షం/రామన్నపేట** : నాగర్ కర్నూలు జిల్లా కొమ్మెర గ్రామంలో జరిగినటువంటి రజక బిడ్డ, రెండు నెలల పసికందును అగ్రకుల అహంకారంతో తన బూటు కాలితో తన్ని చంపినందుకు నిరసనగా గురువారం రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షులు కొండూరు శంకర్ అధ్యక్షతన రామన్నపేట సుభాష్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోరాష్ట్రస్థాయి రజక వృత్తిదారుల సంఘం ఉపాధ్యక్షులు అవనగంటి స్వామి, యాదాద్రి జిల్లాఅధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, జిల్లా కమిటీ సభ్యులు వడ్లకొండ రమేష్, పోన్న ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## మౌనికకు సత్కారం

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల కేంద్రానికి చెందిన వలసాని మౌనిక సీఎం కప్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఆమె విజయంతో త్రిపురారం మండలానికి గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ మౌనికను శాలువాతో సత్కరించి అభినందించారు.క్రీడారంగంలో యువత ముందుకు రావాలని, మౌనిక సాధించిన విజయం ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బైరం కృష్ణ,అనుమల సుధాకర్ రెడ్డి, జంగిల్ శ్రీనివాస్,కోటిరెడ్డి,నగిరి శ్రీనివాస్, ఆంజనేయులు, సైదులు,రాంబాబు,లింగయ్య పాల్గొని మౌనికను అభినందించారు.

## దొంగతనానికి పాల్పడిన దొంగ అరెస్టు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని వాసవి బజార్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో జనవరి 13వ తేదిన దొంగతనానికి పాల్పడి రూ. 67వేల నగదును దొంగిలించిన దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ అజ్మీరా రమేష్ మాట్లాడుతూ గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎస్‌కే బాబా అను వ్యక్తి పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోతుండగా పట్టుకొని విచారించగా తాను జనవరి 13వ తేదిన తెల్లవారుజామున వాసవి బజార్‌లో నాగరాజు ఇంటిని వెనుక నుండి తలుపులు విరగ్గొట్టి బీరువాలో ఉన్న రూ. 67వేలు అపహరించినట్లు ఒప్పుకున్నాడు. విచారణ అనంతరం రూ. 50వేల నగదును నేరస్తుడి నుండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేధించినందుకు సిఐ నవీన్‌కుమార్ ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేమునాయక్, భాస్కర్‌లను అభినందించి, నగదు రివార్డును అందజేశారు.

## స్వపరిపాలన దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సెయింట్‌జాన్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, విద్యాధికారులుగా, ప్రజాప్రతినిధులుగా పాత్రలు ధరించి వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందచేశారు. పాఠశాల కరస్పాండెంట్ శిరీష, పాల్గొన్నారు.

## ముకేష్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కొల్ ముంతల్‌పహాడ్‌కు చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు ముకేష్ ఉత్తర్ ప్రదేశ్‌లోని వారానాసిలో జరిగే యూనివర్సిటి లేవల్ బాక్సింగ్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్ళడానికి కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటి తన వంతు చేయూతగా రూ. 20వేలను గురువారం సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బాక్సింగ్ లో ప్రతిభ కనబరుచుతున్నందుకు సర్పంచ్ యుగేందర్ రెడ్డి ముకేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఏరుకొండ రాము, విప్పలపల్లి జితేందర్ పాల్గొన్నారు.

## బ్యాంకు మిత్ర సోషల్ మీడియా జిల్లా ప్రచార కార్యదర్శిగా క్రిష్ణయ్య

**ప్రజాపక్షం/వేములపల్లి** : ఆల్ బ్యాంక్ మిత్ర అసోసియేషన్ ఆఫ్ ఇండియా సోషల్ మీడియా జిల్లా ప్రచార కార్యదర్శిగా గంట కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మేటి సైదులు అనుమతితో ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు,ఒక సంవత్సరం పాటు కొనసాగే ఈ బాధ్యతలు అసోసియేషన్ రూల్స్ ప్రకారం ప్రజలకు సేవ చేస్తానని రూల్స్‌కు వ్యతిరేకంగా ఏదైనా పొరపాటు జరిగితే స్వచ్ఛందంగా తప్పుకుంటానని అన్నారు.

## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/ఆత్మకూరు(ఎం)** : నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెరలో మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా రజక కులానికి చెందిన రెండు నెలల పసిపాప బేబీ మౌనికను కాలుతో తన్ని హత్య చేసిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్‌తో పాటు మరో ఏడుగురు రెడ్డి వర్గానికి చెందిన వారిని కఠినంగా శిక్షించాలని రజక సహకార సంఘం అధ్యక్షుడు ఎలిమినేటి మురళీకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పైల్ల ప్రశాంత్, మాజీ అధ్యక్షులు వెలిమెల కన్నె సత్యనారాయణ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారులు నగేష్ పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిలో ఒకరికి 4 రోజులు, ఇంకొకరికి 2 రోజుల జైలు శిక్ష జరిమానా, మరో ఇద్దరికి జరిమానా సూర్యాపేట కోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురిని గురువారం కోర్టులో హాజరుపర్చగా ఒకరికి 4 రోజులు జైలు శిక్ష, ఇంకొకరికి 2 రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున జరిమానా, మరో ఇద్దరికి కలిపి రూ.3వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపు రజిత తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోలీసులు చేసే వాహన తనిఖీలు ప్రజల ప్రాణరక్షణ కోసమే అని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్ పూజలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, 40వ వార్డు కౌన్సిలర్ కొంతం రాజేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షిరిడి సాయినాధుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు కర్నాటి రవి కుమార్, మన్నెం సదాశివరెడ్డి పాల్గొన్నారు.



# నూతన కార్పొరేటర్లకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రథమంగా గెలుపొందిన కార్పొరేటర్లను శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఎన్నికల్లో విజయం సాధించిన అల్లి నాగలక్ష్మి మల్లికార్జున్ యాదవ్,అల్లి సుభాష్ యాదవ్,కేశనేని వేణుగోపాల్ రెడ్డి,మహమ్మద్ ఖలీల్ లను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధి,శుభ్రత మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం కార్పొరేటర్లు సహకరించాలని కమిటీ సభ్యులు విన్నవించారు.దేవాలయ అభివృద్ధికి పూర్తి మద్దతు అందిస్తామని కార్పొరేటర్లు హామీ ఇచ్చారు.ఈసందర్భంగా ఆలయ అర్చకులు కోట నాగరాజు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి, నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు శివ పంచాయతన రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నూనె రంగయ్య, కార్యదర్శి పాశం వెంకట్రావు,కోశాధికారి రాజ లింగయ్య, ఉపాధ్యక్షులు మునాస సత్యనారాయణ, మునాస వెంకన్న,సహాయ కార్యదర్శులు పెద్దగోని అంజయ్య,కర్నే అడివప్ప,పద్మ నాగమణి తదితరులు భక్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కళ్ళల్లో వెలుగులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో సరికొత్త వెలుగులు నింపుతున్నాయని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం 13వ వార్డులో వేముల వాసుదేవ్, 6వ వార్డులో ఎదునోజు పద్మజ ప్రభాకర్ చారిలు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. 13వ వార్డు కౌన్సిలర్ సురేపల్లి రాధికా రమేష్, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, కౌన్సిలర్ రావుల జంగయ్య, గంజి గణేష్, తాటి నరసింహా, కొండ శివ తదితరులు ఆయనతోపాటు ఉన్నారు. కాగా మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు మరియు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కలెక్షన్ పై వార్డు అధికారులు బిల్ కలెక్టర్ లతో మున్సిపల్ కమీషనర్ డి.అంజన్ రెడ్డి రివ్యూ నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025 26 వచ్చే మార్చి 31వ తేదీతో ముగుస్తున్నందున మార్చి 31 వ తేదీ లోపు 100 శాతం లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లు పి.ఆదిత్య, పి.రాజేశ్ , వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్టాండ్ డ్రైనేజీ ధ్వంసం.. రహదారిపై మురుగునీరు, ప్రజల ఆవేదన



**ప్రజాపక్షం/నాంపల్లి**: పట్టణ కేంద్రంలోని బస్టాండ్ నుండి రచ్చబండకు నేరుగా వెళ్లే అంతర్గత రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్వాసన వ్యాపిస్తోంది.దీంతో వాహనదారులు,బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్నపాటి వర్షం పడినా రోడ్డంతా నీరు నిలిచి బురద గుంటలుగా మారుతోంది. మురుగునీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు విస్తరిస్తూ పరిసర ప్రాంతాలను అంటు రోగాల ముప్పుకు గురిచేస్తున్నాయి. సమీపంలో నివసించే ప్రజలు దోమల బెడదతో జ్వరం,వైరల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలతో కూడిన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి, పైపు లీకేజీలను అరికట్టాలని, అవసరమైతే కొత్త పైపులైన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు భూభారతి పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతి రైతు పార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని గాంధీనగర్ అగ్రికల్చర్ ఏఈఓ స్వాతి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రం 13వ వార్డు గాంధీనగర్‌లో ఏఈఓ స్వాతితో పాటు కౌన్సిలర్ భూక్యా కౌసల్య, భూక్యా మహేష్ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు 11 అంకెల నంబరు వస్తుందని ఆ నంబర్‌తోనే రైతులకు వచ్చే పథకాలన్నీ అందుతాయన్నారు. పీఎం కిసాన్ పథకం కూడా వర్తించాలంటే ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. పంట నష్ట, పంట భద్రత తదితర వాటికి అవసరమన్నారు. దీనికోసం ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టాపాసుబుక్ తీసుకొని రావాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 60శాతం రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని అన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరాములు, కస్పరాజు రమేష్, సతీష్, రషీద్, వార్డు ఆఫీసర్ నరేష్, సల్మాన్, అశోక్, గంగరాజు, రవి, భాస్కర్, జానయ్య, ప్రభు, ఉప్పి, ఉపేందర్, సాయి పాల్గొన్నారు.



## సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జిల్లా పోలీసు నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన కృష్ణయ్య కుటుంబానికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ చెక్కును అందజేసి ఆయన మాట్లాడారు. సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వ్యాయామం, యోగ చేయడంతోపాటు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. సిబ్బంది కుటుంబాలకు ఆరోగ్య భద్రత పథకం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్, సంక్షేమ ఆర్ఎస్ఐ సాయిరాం సిబ్బంది ఉన్నారు.

## పెట్రోల్ బంక్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పెరుగుతున్న వాహనాల దృశ్య గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గ్రీన్ పాత్ పెట్రోల్ బంక్ ను వాహనదారులు, ట్రాక్టర్ ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డిలు సూచించారు.నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్ పాత్ పెట్రోల్ బంకును వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారులు,వ్యవసాయదారులు పెట్రోల్,డీజిల్ కోసం పట్టణాలు వెళ్లకుండా గ్రామంలోనే పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య,చందనపల్లి గ్రామ సర్పంచ్ పెద్ది లక్ష్మీ గోవర్ధన్,ఉప సర్పంచ్ ఉప్పుల మురళి,బంక్ ప్రొప్రైటర్ తంగెళ్ల సత్తిరెడ్డి తదితరులున్నారు.

## మంత్రి ఆశీర్వాదం తీసుకున్న నాగరత్నం రాజు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పానగల్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు పుట్టినరోజు సందర్భంగా గురువారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్‌లో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని కుటుంబ సభ్యులతో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి ఆలకుంట్ల నాగరత్నం రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని 18వ డివిజన్‌లోని తన నివాసంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అలివేలు మంగాపురం కాలనీలో సిసి రోడ్డుకు పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా నాగరత్నం రాజు మాట్లాడుతూ 18 డివిజన్లో కార్పొరేటర్ గా తన భార్యను గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మీకు ఇచ్చిన హామీల ప్రకారం ఈ డివిజన్‌లో రోడ్లన్నీ పూర్తి చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్రామారెడ్డి,కిషన్ రావు ముత్తయ్య,ధర్మారెడ్డి,కరుణాకర్ రెడ్డి,సత్యం,భారతమ్మ,నీరజ,శైలజ,సుభాషిని అరుణ,సాయిలీల,జ్యోతి,శ్రీదేవి,సుజాత తదితరులు ఉన్నారు.





## జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బాలకృష్ణగౌడ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జాతీయ బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన చెనగాని బాలకృష్ణగౌడ్‌ను నియమిస్తూ గురువారం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి సంక్షేమం అభ్యున్నతికై, బలోపేతానికై కృషి చేయాలన్నారు. బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా బిసిల ఐక్యతను చాటుకోవాలన్నారు. చెన్నగాని బాలకృష్ణగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించిన శ్రీనివాసగౌడ్, సహకరించిన పలువురు బిసి సంక్షేమ సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. బిసి సంక్షేమ సంఘం బలోపేతమే లక్ష్యంగా బిసిల సమస్యల పరిష్కారానికై అలుపెరగని పోరాటం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి నాయకులు పాల్గొన్నారు.

## పది మార్కుల పరిశీలన



**ప్రజాపక్షం/డిండి;** గుండ్లపల్లి మండల పరిధిలోని వివిధ పాఠశాలలలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల మూల్యాంకన ప్రక్రియను గురువారం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని జెడ్పిహెచ్ఎస్ చెరుకుపల్లి, జెడ్పిహెచ్ఎస్ డిండి ప్రాజెక్టు పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబివి మరియు ఆర్పి ఆర్పి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను తనిఖీ బృందం సందర్శించింది. తనిఖీ ప్రక్రియలో భాగంగా వచ్చిన జిహెచ్ఎం రేబాక సదానందంను స్థానిక మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రేబాక టీం సభ్యులు శ్రీను, సంధ్యారాణితో పాటు స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరీక్ష సామాగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/చందంపేట;** చందంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2016/2017 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణి చేశారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ. 5116, ద్వితియ బహుమతి రూ. 3116, తృతియ బహుమతి రూ. 2116లను విద్యార్థులకు అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు గౌతమ్, సందీప్, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# 10నెలలుగా జీతాలు లేక పస్తులు

**104 ఉద్యోగుల కుటంబాలు**
**104 సేవలకు ప్రభుత్వం మంగళం....**




**ప్రజాపక్షం/దేవరకొండ;** నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో దివంగత నేత డా. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన 104 సేవలను అప్పటి ప్రభుత్వం పురుడుపోసింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 104 వాహనాలు మరుగున పడిపోయాయి, అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు 10 నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు రెండు నెలల నుండి అధికారుల చూట్టూ తిరుగుతూ తమ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీకి విన్నవించుకున్నా లాభం లేదని తెలంగాణలో 104 రాష్ట్ర ఏఎన్టీయూసి విభాగం అధ్యక్షులు ఎంఏ హాది తన ఆవేదన వ్యక్తం చేశారు. పది నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ నోచుకోని విధంగా మరోపక్క పిల్లల స్కూల్ ఫీజులు కట్టేలేని పరిస్థితి ఉందని అన్నారు. ఎన్నోసార్లు అధికారుల చూట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతున్న ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం 104 సిబ్బందిపై కనికరించి జీతాలు చెల్లించి తమను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఒకే భవనంలో ఎంపిడిఓ కార్యాలయం...విద్యార్థుల హాస్టల్



**ప్రజాపక్షం/నేరడుగొమ్ము;** నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఒకే భవనంలో ఎంపిడివో కార్యాలయం తో పాటు విద్యార్థుల హాస్టల్ ఏర్పాడు చేయడం ద్వారా కింద అధికారుల కార్యకలాపాలు, పైన విద్యార్థుల హాస్టల్ ఉండడంతో అధికారులకు, విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ కార్యాలయం, విద్యార్థుల హాస్టల్ ఒకే భవనంలో ఉండడం వలన విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడుతున్ననేపథ్యంలో విద్యార్థుల హాస్టల్‌కు కొత్త భవనం ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు. ఎంపిడివో కార్యాలయం ఉండడంతో రోజు ప్రజలతో రద్దీ ఉండడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని తక్షణమే కొత్త హాస్టల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో పాత భవనాలలోనే పోలీస్‌స్టేషన్, ఎంఆర్‌వో కార్యాలయాలు కార్యకలపాలు నిర్వహిస్తున్నారు.

## కోడూరు గ్రామంలో క్షయవ్యాధి నిర్ధారణ శిభిరం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కోడూరు గ్రామం యందు క్షయవ్యాధి నిర్ధారణ శిభిరం ఏర్పాటు చేసి 80 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ మాట్లాడుతూ ఒకరి నుండి ఒకరికి తుంపర్ల ద్వారా గాలి ద్వారా అంటుకునే ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స పొందినట్లయితే టిబి వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. మందులు వాడి వ్యాధిని పూర్తిగా న్యాయం చేయవచ్చు తెలిపారు. ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నందున వారు తప్పనిసరిగా పరీక్ష నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చు నాయక్, సర్పంచ్ వల్లపు ఐలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, ఉపసర్పంచ్ మౌనిక, టిబి మోడల్ పర్సన్ కుంభం వీరయ్య, డిఆర్‌టిబి కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేల్పుపల్లి పెద్దమ్మ చెరువులో ఇరిగేషన్ అధికారుల విచారణ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వేల్పుపల్లి గ్రామంలోని పెద్దమ్మ చెరువు సర్వే నంబర్ 80లోని సుమారు 7 ఎకరాల చెరువు శిఖం భూమిని కబ్జాకు గురవుతుందని కలెక్టర్‌కు పిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఇరిగేషన్ అధికారులు గ్రామానికి చేరుకుని పెద్దమ్మ చెరువు వద్ద విచారణ చేపట్టారని కాంగ్రెస్ పార్టీమండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ తెలిపారు. పెద్దమ్మ చెరువులో కొందరు లీడర్లు అక్రమంగా  పొలాలు అచ్చుకట్టుకుని, ఫెన్సింగ్ చేసి అట్టి చెరువు మట్టిని దౌర్జన్యంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని గత సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతరావుకు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేసిన నేపథ్యంలో తుర్కపల్లి ఇరిగేషన్ ఏఇఇ బిక్కు నాయక్, బాల్ నర్సయ్యలు చెరువును సందర్శించి మట్టి తవ్వకాలను పరిశీలన చేసి స్థానికుల నుండి వివరాలు అడిగి తెలుసున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, బూ అక్రమాలకు ఎవరు పాల్పడ్డచట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోట సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వార్డు సభ్యులు జేరిపోతుల నరేందర్, మాజీ ఉప సర్పంచ్ ధ్యాన బోయిన అచ్చయ్య, వార్డు సభ్యులు జేరిపోతుల యాదగిరి, నాయకులు, గ్రామస్థులు, గుండా ఆంజనేయులు, లింగాల యాదగిరి, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ఉజ్వల యోజన గ్యాస్ పథకం సద్వినియోగం

**ప్రజాపక్షం/నూతనకల్ :** ప్రధానమంత్రి ఉజ్వల యోజన గ్యాస్ పథకమును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీఆంజనేయ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో 13 మంది ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవీల ఉపేందర్, మహేష్, సురేష్, వినియోగదారులు అశోక్ యాదవ్, బాల్క సైదులు, పొట్టపెంజర శ్రీకాంత్ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో  ప్రతి ఒక్కరూ ముందుండాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెంలో నూతన గ్రామ పంచాయితీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన కొమ్మాల గ్రామంలో రూ.20లక్షలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన గ్రామ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అనునిత్యం వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దరూరి యోగానందాచార్యులు, నాయకులు మోరపాక సత్యం, గుడిపల్లి మధుకర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## మంచి సేవకులను కోల్పోవడం బాధాకరం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ (అనంతగిరి) :** అనంతగిరి మండల కేంద్రంలో గ్రేస్ గాస్పల్ గ్లోబల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు సీనియర్ పాస్టర్ ఉప్పెల్లి సత్యంబాబు (48) ఇటీవల కాలంలో ద్వారకుంట గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించడం ద్వారా మంచి సేవకులను కోల్పోవడం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం పాస్టర్ సత్యంబాబు కుటుంబాన్ని పరామర్శించి బేతెస్థ ఫౌండేషన్ తరుపున మ్యానేజింగ్ డైరెక్టర్ దుర్గం కరుణ ప్రభాకర్ క్వింటా బియ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ధరావత్ దానియేలు, ఈ రాజేష్, కంచపోగు రామారావు, బొక్క ఏలీయారాజు పాల్గొన్నారు

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**ప్రజాపక్షం/మోతె :** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో గ్రామ పంచాయితీ సిబ్బందితో 9వ వార్డులో పేరుకపోయిన చెత్తచేదారం పిచ్చి మొక్కలు తొలగించారు. మార్చి 3, 4 తేదీలలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ జాతర సందర్భంగా ప్రతివార్డులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఎక్కడ చెత్తవేయవద్దని గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌కు అందించి సిబ్బందికి సహకరించాలని కోరారు.  వార్డు సభ్యులు డి వీరబాబు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని బిక్యాతండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ బానోతు ఝాన్సీ బాలాజీ గురువారం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లి ఏర్పాటు కృషి చేస్తామని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు, అంగన్‌వాడీ విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ ఆయాలకు సూచించారు. అంగన్‌వాడీ టీచర్ బానోతు అరుణ, ఆశా వర్కర్ నాగలక్ష్మి , పుల్లమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా గుట్టపై ఉన్న మల్లన్న స్వామి దర్శనానికి వచ్చిన దంపతులపై దాడిచేసి రెండు నెలల పసికందు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నందు విద్యార్థి జనసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఈశ్వర్‌సింగ్, ఈశ్వర్, విష్ణు, సాయి పాల్గొన్నారు.

## గ్రామసభ సమావేశం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** కొండూరు గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం సర్పంచ్ అంబటి సీతారాం గారి అధ్యక్షతన జరిగింది.సమావేశంలో తాజుగీత సమస్యలు, శానిటేషన్ విధివిధానాలపై చర్చించడం జరిగింది. అలాగే గ్రామసభకు ఉప సర్పంచ్ జాల యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు,టీచర్,ఆశా వర్కర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ గ్రామసభను విజయవంతంగా నిర్వహించారు.

## ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన నామ రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను గమనించిన రమేశ్ మిత్రబృందం బుధవారం రూ.42 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈకార్యక్రమంలో జంగయ్య,యజ్ఞాచారి,రాజు,ఏరుకొండ అబ్బయ్య,రఘు,వినోద్,ఉషారాణి, తదితరులు పాల్గొని తమ ఉదారతను చాటుకున్నారు.

## కాంగ్రెస్‌లోకి చేరికలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** బండపాలెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు దూదిపాల రాంరెడ్డి, మారం మీనారెడ్డి,దూదిపాల సాగర్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసి గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కాంగ్రెస్ పార్టీ కండువాకప్పిఆహ్వానించారు.ప్రజా సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా ప్రభుత్వ పథకాలపై విశ్వాసంతో వారు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆనందకరం అని తెలిపారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను శిక్షించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల పసిబిడ్డను చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని చాకలి ఐలమ్మ సంఘం తెలంగాణ ఫౌండర్ చైర్మన్ రచయిత ఐదారి శంకర్ డిమాండ్ చేశారు.గురువారం గడియారం సెంటర్లో చాఐ స జిల్లా అధ్యక్షులు ఎలిజల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఐదారి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ఈనెల 18న జరిగిన మల్లన్న జాతరలో 2నెలల పసి బిడ్డను హతమార్చారని అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ అయితరాజు లక్ష్మణ్,పట్టణ అధ్యక్షుడు నలపరాజు సైదులు,సురకారపు యాదగిరి గౌడ్,రాజు వినయ్ కుమార్, గోపాల్,మనబోయిన వెంకన్న దితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ కలెక్టర్‌గా కె.వెంకారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో కె.వెంకారెడ్డి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. క్రితంలో శేరి లింగంపల్లిలో డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్ పని చేస్తున్న వెంకారెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.



# ఈ నాన్నకు సలాం చేయాల్సిందే..!

### దివ్యాంగురాలైన కూతురిని ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లిన తండ్రి ఆదర్శం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** ఆడబిడ్డ అందులోనూ దివ్యాంగురాలు ఆమెకు చదువెందుకులే అని అనుకునే సమాజంలో ఒక తండ్రి తన ఆలోచనతో అందరికీ ఆదర్శంగా నిలిచాడు.మర్రిగూడ మండలంలోని శివన్నగూడెంకు చెందిన మోర సత్యనారాయణ,ధనమ్మ దంపతుల కూతురు మోర శివానికి చిన్నప్పటి నుంచే ఫ్లోరోసిస్ కారణంగా కాళ్లు పనిచేయడం లేదు.అయితే తన బిడ్డ దివ్యాంగురాలే కానీ అశక్తురాలు కాదని తండ్రి నమ్మకం.చదువే ఆమెకు భవిష్యత్తు బాటవేస్తుందని భావించి ప్రతి అడుగులోనూ అండగా నిలుస్తున్నారు.ఇవాళ మోడల్ స్కూల్లో జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షకు హాజరుకావడానికి తండ్రి సత్యనారాయణ తన కూతురిని ఎత్తుకుని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు.పరీక్షా కేంద్రం వద్ద ఈ దృశ్యం చూసిన వారు భావోద్వేగానికి గురయ్యారు.కూతురు చదవాలి,మంచి స్థాయికి చేరాలి అనే తండ్రి సంకల్పం అందరినీ కదిలించింది.సమాజంలో దివ్యాంగులపై ఉన్న అపోహలను చెరిపేసేలా ఈ తండ్రి చేసిన ఈ ప్రయత్నం నిజంగా అభినందనీయం. తల్లిదండ్రుల ప్రేమ,పట్టుదల ఉంటే ఏ అడ్డంకి అయినా అధిగమించవచ్చని మోర సత్యనారాయణ నిరూపించారు.

## స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యం



**ప్రజాపక్షం/హాలియా:** స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక స్వాలంబన కు ఉపయోగపడే ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.గురువారం హాలియాలోని మున్సిపాలిటీ కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం,స్ట్రీట్ వండర్లా ఆర్థిక అభివృద్ధి,ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పీఎం స్వనిధి పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రుణాలు అందేలా మెప్మా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో గల చిన్న వ్యాపారుల ఆర్థిక స్థితి మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో రుణాలను చెల్లించాలని చెప్పారు. తీసుకున్న రుణాలు చెల్లించిన తర్వాతనే కొత్త రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్,డీఎంసీ శివాజీ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్‌గా ఆచార్య కొప్పుల అంజిరెడ్డి నియామకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆర్థిక శాస్త్ర విభాగ ఆచార్యులు, ఆర్ట్స్ సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో పాటు అధికారులు ఆచార్య అలువాల రవి, ఆచార్య ఆకుల రవి అభినందనలు తెలిపారు.స్కూల్ డ్రాప్ అవుట్‌గా ప్రారంభమై ఒక సంవత్సరం గొర్రెల కాపరిగా పనిచేసిన అంజిరెడ్డి, కృషిని బద్ధతతో విద్యను కొనసాగించి పీజీ, పీహెచ్‌డీని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తిచేశారు. సర్దార్ పటేల్ కళాశాలలో, అనంతరం ఎస్‌జీటీగా సేవలందించి,2007లో ఎంసీయూలో సహాయ ఆచార్యులుగా చేరి నేడు రిజిస్ట్రార్ పదవిని అధిరోహించడం స్ఫూర్తిదాయకమని అధికారులు పేర్కొన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం సింగారం గ్రామ వాస్తవ్యుడైన అంజిరెడ్డి ప్రాథమిక విద్య స్వగ్రామంలో,హైస్కూల్ వరకు చాడా గ్రామంలో,డిగ్రీ భువనగిరిలో పూర్తిచేశారు.

## బదిలీ అయినా మాట తప్పని కలెక్టర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జిల్లా పరిపాలనలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న కలెక్టర్ హనుమంత రావు బదిలీ అయిన తర్వాత కూడా తన కంకణాలగూడెం గ్రామానికి చెందిన దత్తత తీసుకున్న భరత్ చంద్ర కుటుంబానికి నివసించడానికి ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని కలెక్టర్ ప్రభుత్వం నుండి 225 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయించి, ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ప్రతి నెల అతను చదువుకు ఆర్థిక భరోసాని రూ.5000 నిత్యవసర సరుకులు అందజేశారు. భరత్ చంద్రకి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. నీకు ఏ ఇబ్బంది వచ్చినా నన్ను సంప్రదించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నాణ్యతతో పాటు వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసిల్దార్ పల్నాటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎస్సై జగన్, ఎంపీఓ నరసింహారావు, సర్పంచ్ వీరేశం, పంచాయతీ సెక్రెటరీ సుభాష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మల్లికార్జున కాలనీలో వోల్టేజ్ సమస్య

**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని తిప్పర్తి రోడ్ ఆరో వార్డులోని మల్లికార్జున కాలనీలో లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని ఏండ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని కాలనీవాసులు వాపోతున్నారు. తక్కువ వోల్టేజ్ కారణంగా ఫ్యాన్లు, కూలర్లు, గృహోపకరణాలు సరిగా పనిచేయక ఎండాకాలంలో ఉక్కపోత పెరిగిందని తెలిపారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై స్పందించిన ఆరో వార్డు కౌన్సిలర్ మట్టిపెల్లి కవిత వీరు సమస్య వాస్తవమేనని, ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ రంజిత్ కుమార్ మాట్లాడుతూ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్వల్ప రిపేర్‌లో ఉందని, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి లో వోల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ (కేతేపల్లి):** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు.కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను సిపిఎం,రైతు సంఘం నాయకులు శుక్రవారం సందర్శించారు.గ్రామానికి చెందిన రైతు కూకుట్ల శోభన్‌కు చెందిన మొక్కజొన్న చేనును పరిశీలించిన నాయకులు పంట పూర్తిగానేలమట్టమైందని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు,కేతపల్లి మండల కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు కోట లింగయ్య పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా విజయం సాధించాలి




**ప్రజాపక్షం/నకిరేకల్ :** పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదివి విజయాన్ని సాధించాలని ప్రకృతి వ్యవసాయ రైతు,మోటివేషనల్ స్పీకర్ ఏదుళ్ళ అంజిరెడ్డి పిలుపునిచ్చారు.గురువారం తాటికల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యువ వికాసంకార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి మేక నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయ అభివృద్ధికి ఒక బీరువా,సుమారు రూ.5వేల విలువైన పుస్తకాలను అందజేశారు.ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ అధ్యక్షుడు రేపాల సతీష్,వెంకటేశ్వర్లు,డాక్టర్ వేణుగోపాల్, శంభులింగా రెడ్డి,అశోక్ రెడ్డి,ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి,ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న,పండుగ తిరుమలయ్య పాల్గొన్నారు.

## జాతీయ సమగ్రత శిబిరం స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మరియన్ కళాశాల కొట్టాయం కేరళ వేదికగా ఈనె ల 17 నుండి 23 వరకు జరిగి న జాతీయ సమగ్రత శిబిరానికి,మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థి కె తరుణ్ పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి దక్షిణ భారతదేశం నుండి వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు హాజరై సామాజిక అంశాలు సేవా కార్యక్రమా లు సాంస్కృతిక ప్రదర్శనలతో పరస్పరం పంచుకున్నారు. ఈ శిబిరం ఎంతో విలువైన స్ఫూర్తిదాయకమైన అనుభవాన్ని మిగిల్చినట్టు కె తరుణ్ తెలియజేశారు.ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మారం వెంకట రమణారెడ్డి,తరుణ్ ను అభినందిస్తూ తన అనుభవాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పంచుకోవాలని సూచించారు.




## వాడుకలోకి దత్తాయిపల్లి బస్టాండ్

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్టు విభాగం ఆధ్వర్యంలో చాలా రోజులుగా వాడుకలో లేని, మురికైనా బస్టాండ్‌ను శుభ్రం చేసి, రంగులువేసి పునరుద్ధరించారు. గ్రామంలోకి వెళ్లే రోడ్డుకు రోడ్లను శుభ్రం చేసి, ఇరువైపులాఉన్న చెట్లకు సున్నం, జాజు రంగులను వేశారు. అదేవిధంగా ఊరంతా పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జరిపోతుల కరుణాకర్, యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ కనక బాలరాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రీకాంత్, వంశీ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## భువనగిరి తహసీల్దార్‌గా జగన్ మోహన్ ప్రసాద్...

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న జగన్ మోహన్ ప్రసాద్ భువనగిరి తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న అంజిరెడ్డి కలెక్టరేట్ ఏవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు అంజిరెడ్డికి, జగన్ మోహన్ ప్రసాద్‌కు శాలువాతో సన్మానం చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ సమాఖ్యభవన నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతన మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, ఉపసర్పంచ్ ఉదయ్ రెడ్డి, కాంగ్రేస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి దార మహేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్, వార్డు సభ్యులు మహేష్, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

## దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/చివ్వెంల** : మండలంలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఏచర్ల ముత్యాలమ్మ తల్లి దేవస్థానం నూతన అభివృద్ధి కమిటిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా జీడిమెట్ల లక్ష్మయ్య, చైర్మన్‌గా బానోతు వెంకటి, వైస్ చైర్మన్‌గా గోనెల లింగయ్య, కార్యదర్శిగా కుంభం వెంకన్న, కోశాధికారిగా మరిపడిగ వెంకటయ్య, సహాయ కార్యదర్శి మాద కుమారి, మొగుదాల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ వినీత్, కార్యవర్గ సభ్యులుగా చిలకమర్రి శ్రీనివాసచారి, షేక్ అజ్జులను ఎన్నుకైన్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.



## పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక



**ప్రజాపక్షం/రామన్నపేట** : పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పల్లివాడ గ్రామంలో నాంపల్లి విజయలక్ష్మి కృష్ణ దంపతులకు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు వాస్తవరూపం దాలుస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నియోజకవర్గానికి 3500 ఇందిర ఇండ్లు మంజూరయ్యాయని, కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరుగుతుండగా మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు మేకల మల్లేష్, నాగులంచ నరేష్, వార్డు సభ్యులు సిరిశాల సోమలక్ష్మమ్మ, మల్లేష్, నాంపల్లి రాజు, మేకల మహేష్, దూదిమెట్ల అశోక్, మేడి మల్లయ్య, సింగపాక నరసింహ, నాంపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, ప్రైవేట్ కాలేజీ బస్సు ఢీ..





### 8 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మండలంలోని గణపవరం స్టేజ్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీకు చెందిన ప్రైవేట్ కాలేజీ బస్, ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది గాయపడగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తొగర్రాయి గ్రామం నుంచి మల్లారెడ్డిగూడెం వైపు మిరపకాయ కూలీలను తీసుకెళ్తున్న ఆటోకు ఎదురుగా కందిబండ వైపు నుంచి వస్తున్న అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజి బస్ గణపవరం గ్రామం వైపు ఆకస్మాత్తుగా మలుపు తిప్పింది. అనుకోకుండా బస్ మలుపు తిప్పడంతో ఆటో డ్రైవర్ అదుపు చేయలేక బస్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో విజయలక్ష్మి, సావిత్రమ్మలకు తీవ్రగాయాలు కాగా వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రేణుక, సుకన్య, నాగమణి, రాంబాబు, వసంత సురేష్, ఉపేందర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారంతా ఒకే గ్రామానికి చెందినవారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కోదాడ రూరల్ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. బస్ డ్రైవర్ నిర్లక్ష్యంగా మలుపు తిప్పడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తూ కొంతసేపు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనాస్థలంలో ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విచ్చలవిడిగా గుడుంబా తయారీ కేంద్రాలు, విక్రయాలు

### గుడుంబాకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్న వైనం

### గుడుంబా అరికట్టడంలో అధికారులు విఫలం....



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా గుడుంబా తయారి కేంద్రాలు, విక్రయాలు వెలిశాయి. మండలంలోని గ్రామాలలో, తండాలలో ఎక్కడ చూసిన గుడుంబా ప్రత్యక్షం అవుతుండడంతో గుడుంబాకు గ్రామాలలో,తండాలలో ప్రజలు బానిసలుగా మారి తమ ప్రాణాలను కొల్పోతున్నారని గ్రామాలలో, తండాలలో యువత, ప్రజలు అనుకుంటున్నారు. మండల వ్యాప్తంగా గుడుంబా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రంలో గ్రామాలకు, తండాలకు రాకుండానే పోయారు. గతంలో ఆయా గ్రామాలలో, తండాలలో ఫిర్యాదులు చేసినప్పటికి ఎక్సైజ్ అధికారులు మాత్రం ఫిర్యాదులను పట్టించుకోకుం డా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. గ్రా మాలలో, తండాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులతో పాటు గుడుంబా విక్రయాలు కూడా విపరీతంగా పెరిగినా పట్టించుకునే నాదుడే కరువయ్యారు. గతంలో ఎక్సైజ్ అధికారులు గ్రామాలలో వారానికి రెండు మూడు రోజులు వచ్చి తనిఖీలు నిర్వహించే వారని ఇప్పడు మాత్రం అధికారులు ఎక్కడా కనిపించకపోవడం, తనిఖీలు చేయకపోవడంతో గ్రామాలలో, తండాలలో విపరీతంగా గుడుంబా విక్రయాలు పెరిగిపోయి, గుడుంబాకు బానిసలుగా మారి ప్రజలు వారి ప్రాణాలు తీసుకొవడంతో పాటు వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. మధ్య వయస్సు వారితో పాటు యువకులు సైతం గుడుంబాకు బానిసలై వారి జీవితాలను నాషనం చేసుకుంటున్నారన్నారు. తండాలలో గుట్టు చప్పుడు కాకుం డా విచ్చలవిడిగా గుడుంబా తయారు చేసి గ్రామాలలో విక్రయిస్తున్నారని తక్షణమే ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి గుడుంబాను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని గ్రామాలలో, తండాలలో గుడుంబా తయారీని పూర్తి స్థాయిలో అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, యువ త అధికారులను కోరుతున్నారు.

## వెటర్నరీ మెడికల్ స్టోర్ ప్రారంభం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి పట్టణంలో వినాయక చౌరస్తా వద్ద శివలింగ వెటర్నరీ స్టోర్‌ను స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు స్వశక్తితో ఎదగాలని తెలిపారు. యాదాద్రి భువనగిరి ప్రాంతంలో పాడి పరిశ్రమ మీద ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని, వారికి నాణ్యమైన సరసమైన ధరలకు ఈ వెటర్నరీ ద్వారా రైతులకు సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కీర్తి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖబాబురావు, కౌన్సిలర్లు, మాజీ పిఎస్ఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, పట్టణ, మండల నాయకులు, సర్పంచులు వెటర్నరీ డాక్టర్లు గోపాల మిత్రలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి, నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఏనుగు రఘుమారెడ్డి పాల్గొన్నారు. అనంతరం రామన్నపేట పట్టణ కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ అక్రమ అరెస్టుని నిరసిస్తూ మోడీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ జాల మణికంఠ, నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ముజాహిద్, నార్కెట్పల్లి మండల అధ్యక్షుడు జిల్లా పృథ్వీరాజ్, రామన్నపేట మాజీ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేష్ రెడ్డి, రామన్నపేట యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కల్లూరి శివ, కేస సాయి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి తుమ్మలపల్లి జాతరకు ఆహ్వానం



**ప్రజాపక్షం/చండూరు:** ఈనెల 27 నుండి మార్చి 6 వరకు జరగనున్న తుమ్మలపల్లిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం మహోత్సవం ( జాత)కు రావలసిందిగా ఆహ్వానిస్తూ బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన ధర్మకర్తల మండలి సభ్యులు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ గుండ్రెడ్డి రమ్య రామలింగారెడ్డి,కార్యనిర్వహణ అధికారి నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం,మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గజ్జల కృష్ణారెడ్డి, ముక్కం శ్రీను,మాజీ సర్పంచ్ బోయపల్లి యాదయ్య,ధర్మకర్తల మండలి సభ్యులు కురుపాటి వెంకటమ్మ,బోయపల్లి రాములు,జిల్లా నరసింహ, కారువంగా తిరుపతయ్య,శర్మ తదితరులు పాల్గొన్నారు.తదితరులు పాల్గొన్నారు.

## పెచ్చులూడుతున్న స్త్రీశక్తి ఉపాధి హామీ భవనం

**ప్రజాపక్షం/రామన్నపేట** : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో 25 లక్షలతో నిర్మించిన స్త్రీశక్తి ఉపాధి హామీ భవనం పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారిందని బిఎస్‌పి మండల అధ్యక్షులు నకిరేకంటి నరేష్ అన్నారు. 2014లో అప్పటి ఎంపీ రాజగోపాల్ రెడ్డి ప్రారంభించిన ఈ బిల్డింగ్ 10 సంవత్సరాలకే శిథిలమవుతుందని ఆరోపించారు. పెచ్చులూడి పడుతున్న ఆఫీసులో ఉద్యోగులు సిబ్బంది ప్రాణాలకు వాటిల్లే ప్రమాదం ఉందని భయం భయంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని ఆయన కోరారు.

